సాక్షి నంద్యాల

మంగళవారం । 12 । నవంబర్ । 2024



ఊపిరి అందక ఉక్కిరిబిక్కిరి

చలికాలం వచ్చిందంటే చిన్న పిల్లల్లో న్యూమోనియా వ్యాధి ప్రబలుతుంది. పలు రకాల వైరస్‌లు, బ్యాక్టీరియా కారణంగా వచ్చే ఈ వ్యాధి చిన్నారులను ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. 8లో▸



అన్నప్రసాదానికి రూ.లక్ష విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు సోమవారం రంగారెడ్డి జిల్లాకు చెందిన బి.నిరంజన్‌రావు రూ.లక్ష విరాళాన్ని అందజేశారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,631.78
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 100.914
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 6,806
అవుట్ ఫ్లో	: 10,064

న్యూస్‌రీల్

వంద శాతం ఫలితాలకు కృషి చేయండి



పాఠశాల ప్రార్థనలో పాల్గొన్న డీఈఓ

నంద్యాల(న్యూటౌన్): పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఫలితాలకు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలను డీఈఓ తనిఖీ చేశారు. ఉదయం 9 గంటలకే పాఠశాలకు చేరుకుని విద్యార్థినులతో కలిపి ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం తరగతి గదులను పరిశీలించారు. మార్చిలో జరిగే పదో తరగతి పరీక్షలకు విద్యార్థినులను ఇప్పటి నుంచే సిద్ధం చేయాలని హెచ్‌ఎం పద్మావతిని ఆదేశించారు.

శ్రీశైలంలో 171 టీఎంసీల నీరు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయంలో సోమవారం సాయంత్రానికి 171.0635 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నీటిమట్టం 876.60 అడుగులకు చేరుకుంది. జూరాల నుంచి నీటి విడుదల నిలిచిపోయింది. సుంకేసుల నుంచి 1,824 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. ఆదివారం నుంచి సోమవారం వరకు ఎగువ ప్రాజెక్ట్‌ల నుంచి 6,092 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. జలాశయం నుంచి దిగువ ప్రాజెక్ట్‌లకు 24,695 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎడమగట్టు కేంద్రంలో 3.50 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు.

గడువులోగా సమస్యలు పరిష్కరించండి

నంద్యాల: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా సూచించారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో పీజీఆర్‌ఎస్‌లో భాగంగా ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదులు పునరావృతం గాకుండా చట్ట పరిధిలో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఏపీజీఈఏ నూతన కార్యవర్గం ఎన్నిక

కర్నూలు(హాస్పిటల్): ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) ఉమ్మడి కర్నూలు జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికైంది. సోమవారం స్థానిక బీఏఎస్ కళ్యాణ మండపంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కో ఆప్షన్ ద్వారా భర్తీ అయిన ఖాళీలతో ఏర్పడిన ఉమ్మడి ఏపీజీఈఏ కర్నూలు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎంసీ. నరసింహులు(వైద్య ఆరోగ్యశాఖ), సహాధ్యక్షులుగా ఏబీ. కోటయ్య(నీటిపారుదల శాఖ), కార్యదర్శిగా జి.ముర్తుజావలి (ఐసీడీఎస్), కార్యనిర్వాహక కార్యదర్శిగా బి.కుమార స్వామి (కమర్షియల్ ట్యాక్స్), కోశాధికారిగా ఎం. మదన్‌మోహన్‌మూర్తి (వైద్య ఆరోగ్యశాఖ), సహాయ కార్యదర్శిగా షేక్ అబ్దుల్ ఖాదర్ (గ్రామ సచివాలయ వ్యవస్థ), వైస్ ప్రెసిడెంట్‌గా ఎస్. మహబూబ్‌బాషా (ఐసీడీఎస్), ఆర్. ఆనమ్మ (నన్నూరు పీహెచ్‌సీ), శ్రీనివాస్ (నీటి పారుదల శాఖ), సంయుక్త కార్యదర్శిగా ఎస్.మధుసూదనయ్య (పంచాయతీరాజ్‌శాఖ) ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఏపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షులు శ్రీకాంత్‌రాజు, ప్రధాన కార్యదర్శి ఆస్కార్‌రావు, ఉపాధ్యక్షులు ఇ. బాలకృష్ణయ్య, ఏపీ నర్సెస్ అసోసియేషన్ అధ్యక్షులు లీలావతి పాల్గొన్నారు.

హాస్టల్ ఫీజు చెల్లిస్తేనే పరీక్షలకు అనుమతిస్తాం

- పరీక్షలు రాయలేకపోయిన సుమారు 40 మంది విద్యార్థులు

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అధికారుల తీరుతో బీటెక్ విద్యార్థులు పలువురు పరీక్షలను రాయలేకపోయారు. ఆర్‌యూసీఈ బీటెక్ మూడో సెమిస్టర్ ప్రాక్టికల్ పరీక్షలను సోమవారం నుంచి నిర్వహించేందుకు షెడ్యూల్ ప్రకటించారు. సుమారు 150 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉంది. అయితే తీరా హాస్టల్ ఫీజు బకాయి ఉందని చెల్లిస్తేనే పరీక్షలకు అనుమతి ఇస్తామని చెప్పడంతో సుమారు 40 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాలేకపోయారు. విద్యార్థి సంఘాల నాయకులు, బీటెక్ విద్యార్థులు కొందరు ఆర్‌యూసీఈ అధికారులతో వాగ్వాదం చేయడంతో మధ్యాహ్నం సెషన్‌లో జరగాల్సిన పరీక్షలను వాయిదా వేశారు. ఈ విషయమై రిజిస్ట్రార్ బి. విజయ్‌కుమార్ నాయుడును సంప్రదించగా చాలా మంది విద్యార్థులకు సంబంధించి హాస్టల్ ఫీజు బకాయి ఉందని పేర్కొన్నారు. దసరా సెలవుల్లోనే బకాయి చెల్లించాలని విద్యార్థులకు చెప్పడం జరిగిందన్నారు. ఫీజు చెల్లిస్తేనే పరీక్షలకు అనుమతిస్తామనేది వాస్తవం కాదు. టెక్నికల్ సమస్యతో పరీక్షల నిర్వహణకు రీ షెడ్యూల్ చేసి 12వ తేదీ నుంచి అందరికీ పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు.



అభివృద్ధి అడుగులు కనిపించ లేదు. సంక్షేమ పథకాలు వికసించ లేదు. సాగు నీటి పెండింగ్ ప్రాజెక్ట్‌లకు నిధులు పారలేదు. న్యాయం గడప తొక్క లేదు. ఇది అంతా ఉట్టి గ్యాస్ బడ్జెట్ అనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌తో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా నాలుగు నెలలు గడిపిన ప్రభుత్వం సోమవారం పూర్తి బడ్జెట్‌లోనూ జిల్లాకు నిరాశే మిగిల్చింది. ఉచిత గ్యాస్ మినహా తక్కిన 5 పథకాలు ఎప్పటి నుంచి అమలు చేస్తారు? నిధుల సంగతి ఏంటి? అనేది తేల్చలేదు. దీంతో మరో ఏడాది పాటు 'సూపర్‌సిక్స్' నిరీక్షణ తప్పదు. ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సోమవారం అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన 2024–25 బడ్జెట్‌పై రాజకీయపార్టీలన్నీ అసంతృప్తి వ్యక్తం చేశాయి.

– సాక్షిప్రతినిధి కర్నూలు

నిధులు పారలేదు.. న్యాయం జరగలేదు..!



హైకోర్టు కాదన్నారు... బెంచ్ సంగతేంటి!



కర్నూలులో హైకోర్టు, నేషనల్ లా యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం సంకల్పించింది. జగన్నాథగట్టుపై 'లా యూనివర్సిటీకి'కి 150 ఎకరాలు కేటాయించి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూమి పూజ చేశారు. రూ.వెయ్యికోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ క్రమంలో అమరావతిలో నేషనల్ లా యూనివర్సిటీ నిర్మిస్తామని రెన్నెళ్ల క్రితం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఈక్రమంలో కర్నూలులో లా యూనివర్సిటీ ప్రస్తావన, కేటాయింపులు బడ్జెట్‌లో లేవు. హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. బెంచ్ వద్దు హైకోర్టు కావాలని 'సీమ' జిల్లాలు ముక్తకంఠంతో నినదిస్తున్నాయి. చివరకు బెంచ్ ప్రస్తావన కూడా లేదు.

- జిల్లా ప్రజలను నిరాశ పరిచిన కేశవ బడ్జెట్
- అన్నదాత సుఖీభవకు నిధులిచ్చినా ఎప్పటి నుంచి అమలుపై స్పష్టత కరువు
- ఉచిత గ్యాస్ మినహా తక్కిన పథకాలకూ కేటాయింపులు లేవు
- హంద్రీ–నీవాకు రూ.867.75 కోట్లు.. ఎల్‌ఎల్‌సీకి రూ.13 కోట్లు
- గత ప్రభుత్వంలో నిర్మాణాలను తామే నిర్మించినట్లు ప్రభుత్వ గొప్పలు
- బడ్జెట్‌పై పెదవి విరుస్తున్న రాజకీయ పార్టీలు

రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్ జిల్లా ప్రజలను ఊరించి ఉసూరుమనిపించింది. ఈ దఫా కచ్చితంగా 'సూపర్‌సిక్స్'కు కేటాయింపులు ఉంటాయని అంతా భావించారు. అయితే ఇప్పటికే అమలు చేసిన ఉచిత గ్యాస్ (ఏడాదికి మూడు సిలిండర్లు) మినహా తక్కిన పథకాలు అమలు తేదీలపై ప్రకటన చేయలేదు. అన్నదాత సుఖీభవకు మాత్రం రూ.4,500 కోట్లు కేటాయిస్తున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తాను ప్రవేశపెట్టిన వ్యవసాయ బడ్జెట్‌లో ప్రకటించారు. అయితే అమలు తేదీ చెప్పలేదు. విధివిధానాలు రూపొందిస్తున్నామని మాత్రమే ప్రకటించారు. ఇప్పటికే ఖరీఫ్, రబీ సీజన్లు ముగిశాయి. ఇప్పటి వరకూ 'అన్నదాత సుఖీభవ' ద్వారా రైతులకు ఇస్తామన్న రూ.20 వేలు ఇవ్వలేదు. దీంతో పాటు 'తల్లికి వందనం' ద్వారా స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికీ రూ.15వేల చొప్పున ఇస్తామని ప్రకటించారు. స్కూళ్లు ప్రారంభమై 6 నెలలవుతోంది.



హంద్రీనీవా కాలువ

ఇప్పటి వరకూ ఆ పథకం అమలు లేదు. బడ్జెట్‌లో ప్రస్తావన లేదు. మహిళలకు ఉచిత బస్సును త్వరలో అమలు చేస్తామని ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ప్రకటన చేస్తూనే ఉన్నారు. బడ్జెట్‌లోనూ అదే చెప్పారు. ఎప్పుడనేది మాత్రం ప్రకటించలేదు. హంద్రీ–నీవా సుజల స్రవంతికి రూ.867.75 కోట్లు కేటాయించారు. అవి ఎత్తిపోతల పథకానికి విద్యుత్ బిల్లులు, ఉద్యోగుల వేతనాలకే ఈ బడ్జెట్ సరిపోతుంది. కాలువ లైనింగ్, డిస్ట్రిబ్యూటరీల ప్రస్తావన బడ్జెట్ లేదు. హంద్రీ–నీవా ద్వారా 'సీమ' జిల్లాలలో 6.25 లక్షల ఎకరాలకు సాగు నీరు 33 లక్షల మంది తాగునీరు అందించాలి. డిస్ట్రిబ్యూటరీలకు కేటాయింపులు లేకుండా, వాటి ప్రస్తావన లేకుండా బడ్జెట్ సాగింది. తుంగభద్ర ఎల్‌ఎల్‌సీకి రూ.13కోట్లు, ఎస్ఆర్‌బీసీకి రూ.44.32కోట్లు, కేసీ కెనాల్‌కు రూ.253.10కోట్లు కేటాయించారు.

జగన్ ప్రభుత్వంలో తొలి బడ్జెట్‌లోనే నవరత్నాలకు కేటాయింపులు

గత ప్రభుత్వం 2019 మే 30న ఏర్పాటైంది. జూలై 12న ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి బడ్జెట్ ప్రవేశపెట్టారు. తొలి బడ్జెట్‌లోనే నవరత్నాలకు పూర్తిస్థాయి కేటాయింపులు చేశారు. నవరత్నాల్లోని ఒకటి, రెండు మినహా తక్కిన అన్ని పథకాలకు ఐదేళ్లలో 5 విడతలుగా పూర్తి కేటాయింపులు చేశారు. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో ఉచిత గ్యాస్ మినహా ఏ పథకం కూడా ఈ ఏడాది అమలయ్యే పరిస్థితి కన్పించడం లేదు.

హవ్వా! రైతు భరోసా కేంద్రాలు నిర్మించారట



గత వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నిర్మించిన 'రైతుభరోసా కేంద్రాలు' తామే నిర్మించినట్లు మంత్రి అచ్చెన్న వ్యవసాయ బడ్జెట్‌లో వెల్లడించారు. ఉపాధిహామీ నిధులతో రాష్ట్రంలో రైతు సేవా కేంద్రాలు నిర్మించామని, ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లో నియోజకవర్గానికి ఒకటి నిర్మించామని వాటి ద్వారా ప్రజలకు సేవలు అందుతున్నాయని చెప్పారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 14 ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లు, 867 (ప్రస్తుతం 600 నిర్మాణం పూర్తయ్యాయి) రైతు భరోసా కేంద్రాలు గత ప్రభుత్వం నిర్మించింది. వీటికి 'రైతు సేవా కేంద్రాలు'గా కూటమి ప్రభుత్వం పేరు మార్చింది. కానీ వాటిని తాము నిర్మించినట్లు చెప్పుకోవడం హాస్యాస్పదం! వ్యవసాయ రంగంలో పురుగు మందుల పిచికారీ, ఎరువులు చల్లడం కోసం డ్రోన్లను సబ్సిడీతో రైతులకు ఇచ్చే కార్యాక్రమాన్ని రూపొందిస్తున్నామని ప్రకటించారు. 2022లోనే డ్రోన్లు ఇవ్వాలని అప్పటి ప్రభుత్వం ప్రకటించి మార్గదర్శకాలు రూపొందించింది. వాటిని ఇప్పుడు రాయితీ ద్వారా అందించనున్నారు. రాష్ట్రంలో కౌలు రైతులకు రూ.1,443 కోట్లు వ్యవసాయ రుణాలు ఇచ్చినట్లు ప్రకటించారు. కర్నూలు జిల్లాలో కేవలం 22 మందికి రూ.55 వేల చొప్పున మాత్రమే ఇచ్చారు.

అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం



రాష్ట్ర బడ్జెట్‌లో అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారు. ఎన్నికల్లో సూపర్‌సిక్స్ అంటూ వాగ్దానం చేసి బడ్జెట్‌లో మాత్రం నిధులు కేటాయించలేదు. రైతులకు ఏడాదికి రూ.20 వేలు, మహిళలకు నెలకు రూ.1,500, తల్లికి వందనం పేరిట ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి రూ.15 వేలు, మహిళలకు ఉచిత బస్సుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. బడ్జెట్ కేటాయింపులు చేయలేదు. జిల్లాలోని సాగు నీటి ప్రాజెక్టులకు అరకొరగా కేటాయింపులు చేశారు. రహదారుల మరమ్మతులకు నిధులే కేటాయించలేదు. కేవలం ప్యాచ్ వర్కులకే నిధులంటే ఎలా. ప్రజల ప్రాణాలు ప్రమాదాల బారిన పడిపోవా. ఇది దగాకోరు ప్రభుత్వం. దగా బడ్జెట్. దీనిని ప్రజలెవరూ హర్షించరు.

– కాటసాని రాంభూపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు

ఎన్నికల హామీలపై స్పష్టతలేని బడ్జెట్



కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను ఎప్పటి నుంచి అమలు చేస్తారో బడ్జెట్‌లో కనీసం ప్రస్తావన చేయలేదు. రాష్ట్ర ప్రజలకు కలిగే నిర్దిష్ట ప్రయోజనాలను పట్టించుకోలేదు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, కర్నూలు జిల్లా సాగునీటిప్రాజెక్టుల అంశాలను విస్మరించింది. ఇది జిల్లా ప్రజలను మోసం చేయడమే అవుతుంది. దళితులు, మహిళలు, మైనార్టీల సంక్షేమానికి నామమాత్రంగా నిధులు కేటాయించడంపై ఆయా వర్గాల ప్రజలపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో అర్థం అవుతుంది. తల్లికి వందనం పథకాన్ని ఎప్పటి నుంచి అమలు చేస్తారో చెప్పలేదు. ఉచిత బీమాను ఇక నుంచి రైతు చెల్లిస్తేనే అమలు అవుతుందని చెప్పడం సిగ్గుచేటు.

– డి.గౌస్‌దేశాయ్, సీపీఎం జిల్లా కార్యదర్శి

పెండింగ్ ప్రాజెక్టులకు రిక్త హస్తం



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ తీవ్ర నిరాశను కలిగించింది. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు కేటాయింపులు లేకపోవడం అన్యాయం. వేదవతి, గుండ్రేవుల, ఆర్‌డీఎస్ కుడి కాలువల నిర్మాణాలకు రిక్త హస్తం చూపించారు. సూపర్‌సిక్స్‌లో భాగమైన తల్లికి వందనం, మహిళలకు నెలకు రూ.1,500, అన్నదాతలకు రూ.20వేల స్పష్టత లేకపోవడం బాధేస్తోంది. ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ప్రజలు తిరగబడతారు.

– బి.గిడ్డయ్య, సీపీఐ,జిల్లా కార్యదర్శి

అన్ని వర్గాలకు మోసం



ఈ బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలను మోసం చేసింది. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాలకు బడ్జెట్‌లో నిధులు ఎందుకు కేటాయించలేదు. రైతులకు ఏడాదికి రూ.20వేలు పెట్టుబడి సాయం ఇస్తామని, బడ్జెట్‌లో రైతుల కోసం రూ.4,500 కోట్లు మాత్రమే కేటాయించడం విడ్డూరం. నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు ఇస్తానని చెప్పి.. బడ్జెట్‌లో ఆ ప్రస్తావనే లేదు. సంక్షేమ పథకాలను అమలు చేయాలనే ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదు.

– ఇసాక్ బాషా, ఎమ్మెల్సీ

జనాభాకు అనుగుణంగా కేటాయింపులు చేయాలి



రాష్ట్రంలో బీసీ జనాభాకు అనుగుణంగా బడ్జెట్‌ను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రస్తుత బడ్జెట్‌లో బీసీ సంక్షేమానికి రూ. 39 వేల కోట్లు కేటాయించడం హర్షణీయమే. అయితే జనాభా దామాషా ప్రకారం మరింత బడ్జెట్‌ను బీసీలకు కేటాయించాలి. అలాగే అంతరించి పోతున్న బీసీ కులవృత్తులను కాపాడాల్సిన బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలి.

– నక్కలమిట్ట శ్రీనివాసులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి

ఇది అంకెలగారడీ బడ్జెట్



కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోంది. రూ.2.94 లక్షల కోట్ల బడ్జెట్‌లో కేటాయింపులు ఏ పద్ధతి ప్రకారం చేశారో చెప్పడం లేదు. కేవలం ఎక్కువ చూపడానికి మాత్రమే ప్రయత్నం చేశారు. ఇది జనాలకు ఏమాత్రం ప్రయోజనం లేని బడ్జెట్. ఎస్సీలకు తీవ్ర అన్యాయం జరిగింది. కేటాయించిన రూ. 1,837 కోట్లలో సబ్ ప్లాన్, కార్పొరేషన్, సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లు, స్కూలు, కాలేజీలకు ఎంత కేటాయిస్తారో చెప్పలేదు. అంకెల గారడీ తప్పా ప్రయోజనం శూన్యం.

– పి.మురళీకృష్ణ, డీసీసీ అధ్యక్షుడు, కర్నూలు

లక్ష దీపోత్సవం.. భక్తకోటి పరవశం



ఆలయ పుష్కరిణి వద్ద లక్ష దీపోత్సవ కాంతులు



కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

- కార్తీక రెండో సోమవారం భక్తులతో కిటకిటలాడిన శ్రీగిరి
- పాతాళగంగలో పుణ్యస్నానాలు
- కనుల పండువగా లక్ష దీపోత్సవం, పుష్కరిణి హారతి



పుష్కరిణికి దశవిధ హారతులు



ఆలయం ముందు భక్తుల రద్దీ



గంగాధర మండపం వద్ద కార్తీక దీపారాధన చేస్తున్న మహిళ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రం కార్తీక శోభితంగా మారింది. భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. కార్తీక మాసం రెండో సోమవారం శ్రీశైలానికి భక్తులు పోటెత్తారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే గాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. వేకువజామునే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి, మల్లన్న దర్శనానికి బారులు తీరారు. లక్ష దీపోత్సవం, పుష్కరిణి హారతిని కనులారా వీక్షించి తరించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు వేకువజామున ఆలయ ద్వారాలను తెరచి దర్శనాలకు అనుమతించారు. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయం ముందు భాగంలోని గంగాధర మండపం వద్ద, ఆలయ ఉత్తర(శివ)మాడ వీధిలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన దీపారాధనలో పలువురు భక్తులు దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

కనుల పండువగా లక్ష దీపోత్సవం, పుష్కరిణి హారతి

లోకకల్యాణం కోసం పుష్కరిణి వద్ద లక్ష దీపోత్సవం, పుష్కరిణి హారతి నిర్వహించారు. లక్ష దీపోత్సవంలో భాగంగా పుష్కరిణి ప్రాంగణమంతా లక్ష దీపాలను ఏర్పాటు చేశారు. భక్తులు భక్తిశ్రద్ధలతో దీపాలను వెలిగించారు. సాయంత్రం స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పుష్కరిణి వద్దకు ఆసీనులు చేసి అర్చకులు, వేదపండితులు విశేషంగా పూజాదికాలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లకు, పుష్కరిణికి దశవిధ హారతులను ఇచ్చారు. భక్తులు హారతులను కనులారా తిలకించి స్వామిఅమ్మవార్లను దర్శించి నేత్రానందభరితులయ్యారు. పూజా కార్యక్రమంలో దేవస్థాన ఇన్‌చార్జ్ ఈఓ ఇ.చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వీడండి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వీడి, నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 885 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ రామునాయక్, నంద్యాల ఆర్డీఓ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు.

వినతుల్లో కొన్ని..

- మహానంది మండలం తమ్మడపల్లె గ్రామానికి చెందిన ఎల్లయ్య తనకు వికలాంగ పెన్షన్ కింద ఇస్తున్న రూ.6 వేలు వస్తుందని సరిపోవడం లేదని, మరింత పెంచేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.
- కోవెలకుంట్ల మండలం జోళదరాశి గ్రామానికి చెందిన సుధాకర్ తనకు ఉన్న 1.81 పొలంలో 1.37 పొలం విక్రయించానని మిగతా 44 సెంట్ల భూమిని ఇతరులు ఆక్రమించుకున్నారని, సంబంధిత స్థలాన్ని తన పేరుపై ఆన్‌లైన్ చేయాలని కోరుతూ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.
- సర్వేనెంబర్ 232లో 0.35 సెంట్ల భూమిని తన పేరుతో ఆన్‌లైన్‌లో ఎక్కించి పాసుపుస్తకం మంజూరు చేయాలని కోరుతూ గడివేముల మండలం కొర్రపోలూరు గ్రామానికి చెందిన కొమ్ము నాగమ్మ కలెక్టర్‌కు దరఖాస్తు అందజేశారు.

ఆజాద్ సేవలు చిరస్మరణీయం



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(న్యూటౌన్): మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశాభివృద్ధికి చేసిన సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. సోమవారం మున్సిపల్ టౌన్ హాల్‌లో ఆజాద్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆజాద్ చిత్రపటానికి అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి జిల్లా కలెక్టర్ పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. డీఈఓ జనార్దన్ రెడ్డి, మైనార్టీ సంక్షేమ అధికారి సబిహా పర్వీన్, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అరబిక్, ఇంగ్లీష్, ఉర్దూ, బెంగాలీ, హిందీ తదితర భాషలు నేర్చుకోవడంతోపాటు తత్వశాస్త్రం, గణితం, చరిత్రలను అభ్యసించి తొలి విద్యాశాఖ మంత్రిగా దీర్ఘకాలం పనిచేసి దేశానికి విశిష్ట సేవలు అందించారన్నారు. నేటి విద్యార్థులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రతి వ్యక్తి ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే విద్య ఎంతో అవసరమని విద్య ప్రాధాన్యతను విస్తృతంగా వ్యాప్తి చెందించడంలో అబుల్ కలాం ఆజాద్ కృషి ఎనలేనిదన్నారు. జిల్లాలో బాల్య వివాహాలను నియంత్రించి, తమ పిల్లలను తల్లిదండ్రులు బాగా చదివించుకోవాలన్నారు. పిల్లలు చెడు వ్యసనాలు, చెడు సాన్నిహిత్యానికి బానిస కాకుండా తల్లిదండ్రులు, గురువులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అంతకుముందు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

క్లుప్తంగా

లైవ్ హిస్ట్రోస్కోపీ వర్క్‌షాప్‌కు స్పందన



హిస్ట్రోస్కోపీ వర్క్‌షాప్‌నకు హాజరైన వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని కొత్తబస్టాండ్ ఎదురుగా ఉన్న జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్‌లో ఫాగ్సి ఆధ్వర్యంలో కర్నూలు అబ్‌స్టెట్రిక్, గైనిక్ సొసైటీ సహకారంతో నిర్వహించిన జాతీయస్థాయి లైవ్ హిస్ట్రోస్కోపీ వర్క్‌షాప్ విజయవంతమైనట్లు సీఈఓ డాక్టర్ చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం రాత్రి వరకు కొనసాగిన ఈ వర్క్‌షాప్‌లో దేశం నలుమూలల నుంచి ఏడుగురు స్పెషలైజేషన్ చేసిన గైనకాలజిస్టులు హాజరై 14 హిస్ట్రోస్కోపీ సర్జరీలు నిర్వహించారన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి 200 మంది గైనకాలజిస్టులు, పీజీలు హాజరుకాగా వారికి ఆడిటోరియంలో లైవ్ బ్రాడ్‌కాస్టింగ్ ద్వారా సర్జరీలను చూసే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు.

మహానందీశుడికి విరాళాలు



ఈఓ శ్రీనివాసరెడ్డికి చెక్కు అందిస్తున్న దాతలు

మహానంది: మహానందిలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి సోమవారం మసీదుపురం గ్రామానికి చెందిన శ్రీ వెంకటేశ్వర పాలిమర్స్ వ్యాపార సంస్థ నిర్వాహకులు శ్రీనివాసరెడ్డి రూ.1,01,116 విరాళం అందించారు. దాతలకు ఈఓ శ్రీనివాసరెడ్డి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించారు. అలాగే నంద్యాల పట్టణంలోని బాలాజీ కాంప్లెక్స్‌కు చెందిన కూరాకుల కృష్ణమూర్తి, జ్యోతి దంపతులు రూ.34 వేలు విరాళం అందించారు. కర్నూలు జిల్లా పెద్దపాడుకు చెందిన చంద్రకళాధర్‌రెడ్డి కుమారుడు లోకేష్ రెడ్డి, మాధవి దంపతులు రూ.1.35 లక్షలతో బంగారు కాసుల పేరు (హారం) చేయించి అందించినట్లు ఈఓ, వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని తెలిపారు.

రాజగోపుర నిర్మాణానికి..



దాతలకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి సోమవారం భక్తులు విరివిగా విరాళాలు అందజేశారు. కోడుమూరు వాస్తవ్యులు సరిత, శ్రీనివాసులు దంపతులు రూ.1,00,116లను ఆలయ కార్యాలయంలో అందజేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం దాతలచే స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు, పూలమాల, శేషవస్త్రాలు, లడ్డూలు, బాండును, ఫొటోను అందజేశారు. ఆలయ పర్యవేక్షకుడు మల్లికార్జున ఉన్నారు.

ఊపిరి అందక ఉక్కిరిబిక్కిరి

- న్యుమోనియాతో చిన్నారులు సతమతం
- వృద్ధులు, వ్యాధి నిరోధక శక్తి తగ్గిన వారిలోనూ ఇబ్బందులు
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా వైద్యం
- చిన్నారులకు రాకుండా ఉచితంగా పీసీవీ వ్యాక్సిన్
- నేడు ప్రపంచ న్యుమోనియా డే

చలికాలం వచ్చిందంటే చాలా మంది చిన్న పిల్లల్లో న్యుమోనియా వ్యాధి ప్రబలుతుంది. చలి తీవ్రత పెరిగే కొద్దీ ఆసుపత్రులకు వచ్చే వారి సంఖ్య క్రమంగా పెరుగుతుంది. పలు రకాల వైరస్‌లు, బ్యాక్టీరియా కారణంగా వచ్చే ఈ వ్యాధి చిన్నారులను ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. ఇది కొన్నిసార్లు ప్రాణాంతకంగా మారుతుంది. ఈ నెల 12న ప్రపంచ న్యుమోనియా డే సందర్భంగా ప్రత్యేక కథనం.

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలతో పాటు జిల్లాలోని సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రుల్లో న్యుమోనియాకు అక్కడి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. కర్నూలు ప్రభుత్వ వైద్యశాల చిన్నపిల్లల ఓపీకి ప్రతిరోజూ 300 మంది పలు రకాల వ్యాధులతో చికిత్స కోసం వస్తుండగా అందులో 60 మంది దాకా న్యుమోనియా బాధితులు ఉంటున్నారు. చలికాలంలో ఈ సంఖ్య 150 నుంచి 200 దాకా ఉంటోంది. వీరిలో అవసరమైన వారిని వార్డులో చేర్చుకుని చికిత్స అందిస్తున్నారు. వీరికి అవసరమైన యాంటీబయాటిక్ మందులు, ఇంజెక్షన్లు, ఆక్సిజన్, నెబులైజేషన్ ఇస్తున్నారు. పరిస్థితి విషమంగా ఉన్న రోగులకు వెంటిలేటర్ సపోర్ట్ కూడా ఇస్తున్నారు. కర్నూలుతో పాటు ఆదోని, ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా చికిత్స చేస్తున్నారు.

పీసీవీతో న్యుమోనియాకు చెక్

జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో రొటీన్ ఇమ్యూనైజేషన్‌లో భాగంగా ఆరు వారాలు, 14 వారాలు, 9వ నెల వయస్సులో చిన్నారులకు మూడు డోసుల పీసీవీ వ్యాక్సిన్ (నీమోకోకల్) ఇస్తున్నారు. ఇది భవిష్యత్‌లో చిన్నారులకు

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- దగ్గు/తుమ్మేటప్పుడు ముక్కు, నోరును కప్పుకోవాలి
- సబ్బుతో చేతులను శుభ్రంగా కడుక్కోవాలి
- ముక్కు, నోరు, కళ్లను తరచుగా తాకరాదు
- ప్రొటీన్, విటమిన్–సి, జింక్ ఎక్కువగా ఉండే ఆహారం ఇవ్వాలి
- దగ్గు, జలుబు ఉన్నప్పుడు మాస్క్ ధరించాలి
- వ్యాక్సిన్, రొటీన్ చెకప్ తీసుకోవడం వల్ల ఈ వ్యాధిని నివారించవచ్చు
- ముఖ్యంగా ధూమపానం అలవాటు మానేయాలి

న్యుమోనియా రాకుండా అడ్డుకుంటుంది. దీంతో పాటు న్యుమోనియా వచ్చిన చిన్నారులను ఆశాలు, ఏఎన్‌ఎంలు గుర్తించి వారికి దగ్గు, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది ఉంటే అమాక్సిలిన్ సిరప్ ఇస్తారు. తీవ్రంగా ఉంటే సీహెచ్‌సీ, పీహెచ్‌సీ, ఏరియా ఆసుపత్రి, బోధనాసుపత్రికి రెఫర్ చేసి అక్కడ మెరుగైన వైద్యం అందేలా చేస్తారు.



న్యుమోనియా అంటే..

సాధారణంగా ఊపిరితిత్తుల్లో వచ్చే ఇన్‌ఫెక్షన్‌ను వైద్యులు న్యుమోనియాగా పరిగణిస్తారు. ఇది ముఖ్యంగా పిల్లల్లో, వయోవృద్ధుల్లో, ఇమ్యూనిటీ (వ్యాధినిరోధక శక్తి) తక్కువగా ఉన్నవారు, ధూమపానం అలవాటు ఉన్న వారిలో వస్తుంది. ఇందులో బ్యాక్టీరియా, వైరస్, ఫంగస్‌కు సంబంధించిన క్రిముల కారణంగా ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్ రావచ్చు. ఊపిరితిత్తుల్లో అల్వియోలి ద్రవం లేదా చీముతో నిండినప్పుడు శ్వాస తీసుకోవడం నరకంగా మారుతుంది. కొన్నిసార్లు ఈ పరిస్థితి ప్రాణాంతకమవుతుంది. వ్యాధినిర్ధారణ పరీక్షల్లో భాగంగా ఛాతి ఎక్స్‌రే, ఛాతి సీటీ స్కాన్, గళ్ల పరీక్షలు, రక్త పరీక్షలు, అవసరమైన వారికి బ్రాంకోస్కోపి ద్వారా ఈ వ్యాధిని నిర్ధారిస్తారు.

లక్షణాలు

న్యుమోనియాలో కఫంతో కూడిన దగ్గు, చలి, వణుకుతో పాటు జ్వరం, ఛాతినొప్పితో పాటు శ్వాస తీసుకోవడం కష్టంగా ఉండటం(ఆయాసం), బలహీనం, నీరసంగా శక్తి తక్కువగా ఉన్నట్లు అనిపించడం, వికారం, వాంతులు విరేచనాలు రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. మరికొందరిలో శరీర ఉష్ణోగ్రత సాధారణం కంటే తక్కువగా ఉంటుంది.

సకాలంలో చికిత్స అందించాలి



న్యుమోనియా సాధారణంగా చిన్నపిల్లల్లో ఎక్కువగా వస్తుంది. దగ్గు, ఆయాసం, జలుబు, జ్వరం లక్షణాలు కనిపిస్తాయి. ఆయాసం కనిపిస్తే వెంటనే పిల్లలను వైద్యుల వద్దకు తీసుకెళ్లి అవసరమైన పరీక్షలు చేయించి మందులు ఇప్పించాలి. ఆలస్యం చేసే కొద్దీ ఈ వ్యాధి ప్రాణాంతకం అవుతుంది. అప్పుడు వెంటిలేటర్‌పై ఉంచి మందులు ఇవ్వాల్సి ఉంటుంది. సకాలంలో ఆసుపత్రికి తీసుకొస్తే వైరస్, బ్యాక్టీరియాను బట్టి మందులు ఇస్తాం. – డాక్టర్ బి.విజయానందబాబు, చిన్నపిల్లల విబాగాధిపతి, జీజీహెచ్, కర్నూలు

వ్యాధి తీవ్రతను బట్టి చికిత్స



మనం పీల్చే గాలితో పాటు బ్యాక్టీరియా, వైరస్, ఫంగస్ వంటి సూక్ష్మజీవులు శరీరంలోకి ప్రవేశించడం వల్ల ఊపిరితిత్తులకు ఇన్‌ఫెక్షన్ సోకి న్యుమోనియా మారుతుంది. పిల్లలు, వృద్ధులు, డయాబెటీస్, ఆల్కహాలు, స్మోకింగ్, హెచ్ఐవీ, ఆస్తమా, ఇతర దీర్ఘకాలిక ఊపిరితిత్తుల సమస్యలు, కిడ్నీ సమస్యలు ఉన్న వారిలో ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉంది. వ్యాధి తీవ్రతను బట్టి న్యుమోనియాకు చికిత్స అందిస్తాం. –డాక్టర్ కమ్మర వినోద్‌ఆచారి, పల్మనాలజిస్టు, కర్నూలు

141 గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం అమలు

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో 141 గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం అమలు చేస్తూ 18 వేల ఎకరాల్లో రసాయనాలు లేకుండా పంటలను సాగు చేస్తున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ శాఖ రైతు సాధికారసంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకం స్టాల్‌ను కలెక్టర్ ప్రారంభించారు. స్టాల్‌లో ఏర్పాటు చేసిన ఆహార ఉత్పత్తులు, కూరగాయలను కలెక్టర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. రైతుకు నిరంతరం ఆదాయం వచ్చేలా ఏటీఎం మోడల్ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రోత్సాహమిస్తోందని, 20 సెంట్ల విస్తీర్ణంలో చిన్న కమతాల్లోనూ ప్రకృతి వ్యవసాయాన్ని అమలు చేయడమే ఏటీఎంల లక్ష్యమని వివరించారు. జిల్లాలో 500 ఏటీఎం మోడల్ సాగులను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయాధికారి పీఎల్ వరలక్ష్మి, రైతు సాధికార సంస్థ డీసీఎం చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల పరిధిలోని సర్పరాజపురం గ్రామానికి చెందిన బోయ మనోహర్ (45) అనే రైతు అప్పుల బాధతో ఆదివారం సాయంత్రం పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటనపై ఎస్‌ఐ జి.అశోక్ తెలిపిన మేరకు వివరాలు.. గ్రామానికి చెందిన బోయ మనోహర్, లక్ష్మీదేవి దంపతులకు ఇద్దరు కుమార్తెలు సంతానం. వీరు తమకున్న రెండెకరాల పొలంతోపాటు మరో మూడెకరాలు కౌలుకు తీసుకుని పత్తి, వేరుశనగ పంటలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పొలం పెట్టుబడుల కోసం సొసైటీలో లోన్‌తోపాటు ప్రైవేట్ వ్యక్తుల వద్ద దాదాపుగా రూ.9 లక్షల వరకు అప్పులు చేశాడు. ఈ యేడాది పంటలు అంతంత మాత్రంగానే ఉండటంతో అప్పులు తీర్చే మార్గం కానరాక మనస్తాపం చెంది ఆదివారం సాయంత్రం పొలంలోనే పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇరుగుపొరుగు వారు కర్నూలు ఆస్పత్రికి తరలించగా కోలుకోలేక సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

గోనెగండ్ల: మండల పరిధిలోని వేముగోడు గ్రామ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన ప్రేమర మహేష్ అక్కడికక్కడే మృతి చెందగా సుజ్ఞానం అనే వ్యక్తి తీవ్రగాయాలపాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. వేముగోడుకు చెందిన మహేష్, సుజ్ఞానం ద్విచక్రవాహనంపై కోడుమూరుకు వెళ్లి పని ముగించుకొని తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. కలపరి గ్రామ రహదారి సమీపంలో ప్రధాన రోడ్డుపై వారి బైక్‌ను కోడుమూరు వైపు వెళుతున్న అంబులెన్స్ జీపు వేగంగా ఢీకొనడంతో మహేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. సుజ్ఞానం తీవ్ర గాయాలపాలయ్యాడు. మృతుడికి భార్య రాధ, ముగ్గురు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. గాయాలపాలైన సుజ్ఞానంను చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు.

కుమారుడే హంతకుడు

బండిఆత్మకూరు: మండల పరిధిలోని ఈర్నపాడు గ్రామంలో ఈ నెల 4వ తేదీన అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన ఘటనలో కుమారుడే హత్యకు పాల్పడినట్లు తెలిసింది. ఘటనపై ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కంచబోయిన నాగలక్ష్మి (48)కి కుమారుడు, వివాహం అయిన కుమార్తె ఉన్నారు. కుటుంబం వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవారు. కుమారుడు దస్తగిరి (32) మద్యానికి బానిసై జులాయిగా తిరిగేవాడు. ఈ క్రమంలో తల్లి ప్రవర్తనపై అనుమానం పెంచుకున్నాడు. ఈనెల 4వ తేదీన రాత్రి నాగలక్ష్మి నిద్రిస్తుండగా హత్య చేసి తర్వాత ఏమీ తెలియనట్లుగా ఉన్నాడు. ఈ కేసు విచారణలో భాగంగా దస్తగిరి తీరుపై పోలీసులకు అనుమానం రావడంతో తమదైన శైలిలో విచారించగా నేరం బయటపడింది. నిందితుడిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు మూడు ఇంక్రిమెంట్లు కట్

కర్నూలు(సెంట్రల్): గతంలో గుడివాడ మునిసిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన పీవీ రమణ మునిసిపల్ నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు నేరం రుజువు కావడంతో మూడు ఇంక్రిమెంట్లను కట్ చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేటివ్ లోకాయుక్తకు నివేదించారు. గతంలో ఆయన నిధులను దుర్వినియోగం చేసినట్లు లోకాయుక్తాలో ఫిర్యాదుతో 619/2024/బీ1 కేసు నమోదైంది. దీంతో లోకాయుక్త పూర్తి స్థాయి విచారణ చేయాలని డైరెక్టర్ ఆఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేటివ్‌ను ఆదేశించింది. పూర్తి స్థాయిలో విచారణ అనంతరం శానిటరీ ఇన్‌స్పెక్టర్ నిధులను దుర్వినియోగం చేసినట్లు తేలడంతో ఆయన జీతంలో మూడు ఇంక్రిమెంట్లను కట్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు సోమవారం జరిగిన విచారణలో ఈ విషయాన్ని నివేదించడంతో కేసును మూసివేసినట్లు రిజిస్ట్రార్ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేశారు

- న్యాయం చేయాలని బాధితుల ఫిర్యాదు
- ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఎస్పీకి మొర

కర్నూలు (టౌన్): తన పొలాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తానని చెప్పి మహేష్ అనే వ్యక్తి రూ.2.65 లక్షలు తీసుకుని మోసం చేసినట్లు దేవనకొండ మండలం పల్లెదొడ్డి గ్రామానికి చెందిన భీమలింగడు ఫిర్యాదు చేశారు. సోమవారం కర్నూలు నగరంలోని కొత్తపేటలో ఉన్న జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు ఎస్పీ బిందుమాధవ్‌ను కలసి తమ వినతులు అందజేశారు. మొత్తం 86 మంది అర్జీలు అందించగా విచారణ జరిపి చట్టపరంగా బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ వెల్లడించారు.



ఫిర్యాదుదారుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ బిందుమాధవ్

ఫిర్యాదుల్లో కొన్ని..

- ఎమ్మిగనూరులో యోగా టీచర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.6 లక్షలు తీసుకుని గూడూరుకు చెందిన శుభాకర్ మోసం చేశాడని కర్నూలుకు చెందిన శ్వేతారెడ్డి ఫిర్యాదు చేశారు.
- పొట్లపాడుకు చెందిన తగ్గుల్లె నాగరాజు ఏపీ మోడల్ స్కూల్‌లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.5 లక్షలు తీసుకుని మోసం చేశాడని దేవనకొండ మండలం వెంకటాపురానికి చెందిన అన్వేష్
- అల్లుడు శేఖర్ తన కూతురు పద్మావతిని కొట్టి తీవ్రంగా గాయపరిచాడని, తన కూతురికి, పిల్లలకు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని వెల్దుర్తి మండలం బోగోలుకు చెందిన సోమేష్
- ప్లాటు కొనుగోలు చేసినందుకు రూ.50 లక్షలు కట్టించుకుని రిజిస్ట్రేషన్ చేయకుండా డబ్బులు వాపసు ఇవ్వకుండా కర్నూలుకు చెందిన వసంతకుమారి అనే మహిళ బెదిరింపులకు పాల్పడుతున్నారని స్థానిక గురురాఘవేంద్ర నగర్‌కు చెందిన రామ్మోహన్
- తన ప్రమేయం, సంతకం లేకుండా తన బావ క్రెడిట్ కార్డు లోన్ రూ.5 లక్షలు, బిజినెస్ లోన్ రూ.లక్ష తీసుకుని తిరిగి కట్టకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వెల్దుర్తికి చెందిన రాజేష్
- ఇల్లు కట్టించి ఇస్తామని చెప్పి జాయ్ హోమ్స్‌కు చెందిన చంద్రకంటి రామకృష్ణ అలియాస్ కిషన్ డబ్బులు తీసుకుని ఇప్పుడు ఇంకా ఎక్కువ డబ్బులు కావాలని ఇబ్బందులకు గురిచేస్తున్నారని స్థానిక గణేష్ నగర్‌కు చెందిన మల్లికార్జున ఫిర్యాదు చేశారు.

బైక్‌ల దొంగ అరెస్ట్

- రూ.15 లక్షలు విలువ చేసే 20 బైక్‌లు స్వాధీనం

నంద్యాల: నంద్యాల, ప్రకాశం జిల్లాల్లో మోటారు బైక్‌ల చోరీకి పాల్పడుతున్న దొంగను నంద్యాల పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం రాత్రి సెంట్రల్ క్రైమ్ పోలీసు స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా కేసు వివరాలు వెల్లడించారు. గత కొంత కాలంగా నంద్యాల పట్టణంలో, ప్రకాశం జిల్లాలోని పలు పోలీసు స్టేషన్ల పరిధిలో మోటారు సైకిళ్ల చోరీకి గురవుతుండటంతో దొంగల కోసం ప్రత్యేక టీంను ఏర్పాటు చేశామన్నారు. మహానంది మండలం బసాపురం గ్రామానికి చెందిన వెంకటరమణ ఈ చోరీలకు పాల్పడుతున్నట్లు గుర్తించామన్నారు. ఏఎస్పీ యుగంధర్‌బాబు, వన్‌టౌన్ సీఐ సుధాకర్ రెడ్డి, సీసీఎస్ సీఐ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని చెరువు కట్ట వద్ద ఉన్న వెంకటరమణను అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. ఇతని వద్ద నుంచి రూ.10 లక్షలు విలువ చేసే 20 మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడు మోటారుసైకిళ్లను నకిలీ తాళాలతో అపహరించి బైక్ నంబరు తొలగించి మరో నంబరు వేసుకొని, బైక్ రంగు కూడా మార్చి తిప్పేవాడన్నారు. ఈ కేసును చేధించిన సీఐ సుధాకర్‌రెడ్డి, సీసీఎస్ సీఐ సురేష్‌కుమార్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.



బైక్‌లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

గోల్డ్ మైనింగ్ ప్లాంట్ పరిశీలన

తుగ్గలి: పగిడిరాయి సమీపంలో ఏర్పాటు చేస్తున్న జియో మైసూర్ గోల్డ్ మైనింగ్ కంపెనీ ప్లాంట్‌ను సోమవారం సాయంత్రం పత్తికొండ ఆర్డీవో డాక్టర్ ఎస్. భరత్‌నాయక్ పరిశీలించారు. ప్లాంట్‌లో యంత్రాలు, మైనింగ్ విస్తీర్ణం, బంగారం ఉత్పత్తి, అక్కడ పనిచేస్తున్న కార్మికుల వివరాలు, భద్రత చర్యల గురించి కంపెనీ ప్రతినిధి రామ్మోహన్‌రెడ్డి ఆర్డీవోకు వివరించారు. అంతకు ముందు రైల్వే డబుల్ లైన్ విస్తరణలో పోయిన భూములను ఆర్డీవో పరిశీలించారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ రమాదేవి, సర్వేయర్ సుధాకర్, వీఆర్వోలు ఉన్నారు.

యురేనియం తవ్వకాలు ఆపే వరకు పోరాటం



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అఖిలపక్షాల నాయకులు

కర్నూలు(సెంట్రల్): కప్పట్రాళ్ల పరిసర ప్రాంతాల్లో యురేనియం తవ్వకాలు నిలుపుదల చేసేవరకు పోరాటం చేస్తామని ప్రజాస్వామ్య సంఘాల ఐక్య వేదిక ప్రకటించింది. సోమవారం ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ బస్తిపాడు రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పీటీపీ జిల్లా నాయకులు శ్రీనివాసరావు, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, సీపీఎం నాయకుడు రామకృష్ణ, ఎస్‌డీపీఐ జిల్లా నాయకులు చాంద్‌బాషా, వకీల్‌బాషా, నరసింహులు, నాగన్న, హరీష్, పాణి, డేవిడ్, భాస్కరరెడ్డి, కప్పట్రాళ్ల, కోటకొండ, నెల్లిబండ తదితర గ్రామ ప్రజలతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కన్వీనర్ బస్తిపాడు నాగరాజు మాట్లాడుతూ.. యురేనియం తవ్వకాలను నిలుపుదల చేయకపోతే ప్రజలు తిరగబడతారని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యురేనియం తవ్వకాలు చేపట్టడం అన్యాయమన్నారు. కేంద్ర ప్రభుత్వంలో టీడీపీ, జనసేన భాగస్వాములు కావడంతో నిలుపుదల చేయించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. యురేనియం తవ్వకాలను నిలుపుదల చేయాలని దాదాపు 15 గ్రామాల ప్రజలు రోడ్డెక్కితే జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులెవరూ కనీసం పలకరించడం లేదని, కలెక్టర్, ఎస్పీలు వారి సమస్యను వినడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ పి.రంజిత్‌బాషాను కలిసి వినతి పత్రం సమర్పించారు.

పుణ్యక్షేత్రాల సందర్శనలో పుత్రశోకం

- మహానంది కోనేరులో పడి బాలుడి మృతి



బాలుడు చక్రధర్‌రెడ్డికి ప్రథమ చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

మహానంది: కార్తీక మాసం సందర్భంగా శైవ క్షేత్రాల సందర్శనకు బయలుదేరిన ఓ కుటుంబంలో విషాదం అలుముకుంది. మహానంది క్షేత్రంలోని కోనేరులో ప్రమాదవశాత్తు ఓ బాలుడి పడి మృతి చెందాడు. ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు...అనంతపురం జిల్లా పుట్లూరు మండలం శనగల గూడూరు గ్రామానికి చెందిన హరికుమార్‌రెడ్డి, నాగజ్యోతి దంపతులు కుమారులు చక్రధర్‌రెడ్డి (9), విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి ఆదివారం యాగంటికి చేరుకున్నారు. అక్కడి నుంచి సోమవారం ఉదయం మహానందికి వచ్చారు. చిన్నకోనేరు వద్ద స్నానాలు ఆచరించేందుకు వెళ్లగా హరికుమార్‌రెడ్డి బాత్‌రూమ్‌కు వెళ్తూ పిల్లలను భార్య వద్ద ఉంచి వెళ్లాడు. అయితే పెద్దకుమారుడు చక్రధర్‌రెడ్డి కాలుజారి నీళ్లల్లో పడ్డాడు. భక్తులు కాపాడి బయటకు తీసేలోపు అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో వెంటనే వైద్యశిబిరం వద్ద ప్రాథమిక చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. బాలుడి తల్లిదండ్రుల ఫిర్యాదు ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆకతాయికి జైలుశిక్ష

నంద్యాల(వ్యవసాయం): మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న వ్యక్తికి సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి సోమవారం జైలు శిక్షను ఖరారు చేసినట్లు పోలీసులు తెలిపారు. నంద్యాల పట్టణంలోని నందమూరి నగర్‌కు చెందిన షేక్‌బషీర్ శ్రీరామ థియేటర్ వద్ద దారిన పోయే మహిళల పట్ల సైగలు, ఈలలు, కేకలు వేస్తూ అసభ్యకర పదజాలంతో వారికి ఇబ్బంది కలిగేలా ప్రవర్తిస్తుండటంతో స్థానిక ప్రజలు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా 14 రోజులు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెల్లడించారు.

సృజనాత్మకతకు పదును

- 21 నుంచి కౌశల్ సైన్స్ క్విజ్ పోటీలు
- ప్రభుత్వ పాఠశాలల్లోని 8, 9, 10 తరగతుల విద్యార్థులకు అవకాశం
- రిజిస్ట్రేషన్‌కు 15వ తేదీ వరకు గడువు



కౌశల్ పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం (ఫైల్)

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి ప్రోత్సహించేందుకు భారతీయ విజ్ఞాన మండలి (బీవీఎం), ఆంధ్రప్రదేశ్ సైన్స్ సిటీ సంయుక్త ఆధ్వర్యంలో కౌశల్–2024 పోటీల నిర్వహణకు సన్నద్ధమవుతున్నారు. ప్రతిభాన్వేషణలో భాగంగా విద్యార్థులకు పాఠశాల, జిల్లా స్థాయి పోటీలు ఆన్‌లైన్‌లో, రాష్ట్రస్థాయి పోటీలు ఆఫ్‌లైన్‌లో నిర్వహించనున్నారు. రాష్ట్రస్థాయి పోటీలను డిసెంబర్ 29, 30 తేదీల్లో విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ కళాశాలలో నిర్వహిస్తారు. సైన్స్ క్విజ్, పోస్టర్ కాంపిటీషన్, వైజ్ఞానిక లఘు చిత్రాల విభాగాల్లో పోటీలు ఉంటాయి. విజేతలుగా నిలిచిన వారికి నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రం, జ్ఞాపికలు అందజేయనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులు కాగా ప్రతి తరగతి నుంచి ముగ్గురు మెరిట్ విద్యార్థులను మాత్రమే పోటీలకు ఎంపిక చేస్తారు. ఆయా తరగతులకు సంబంధించి గణితం, విజ్ఞానశాస్త్రం, సాంఘికశాస్త్రం, విజ్ఞాన రంగంలో భారతీయ శాస్త్రవేత్తల కృషి అనే అంశాలకు సంబంధించి ఇప్పటివరకు జరిగిన సిలబస్ మేరకు సన్నద్ధం కావాల్సి ఉంటుంది.

అర్హులైన విద్యార్థులు
8, 9, 10 తరగతుల వారు
రిజిస్ట్రేషన్‌కు ఆఖరు తేదీ
నవంబర్ 15
పాఠశాల స్థాయి పరీక్ష ఆన్‌లైన్
నవంబర్ 21, 22, 23
జిల్లా స్థాయి పరీక్ష ఆన్‌లైన్
డిసెంబర్ 6
రాష్ట్రస్థాయి పోటీలు ఆఫ్‌లైన్
డిసెంబర్ 29, 30

15లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో చదువుతూ ఆసక్తి గల విద్యార్థుల వివరాలను పాఠశాల కో–ఆర్డినేటర్లు నవంబర్ 15వ తేదీ లోపు www.bvmapost ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ఈ విషయంపై గణితం, సైన్సు ఉపాధ్యాయులు విద్యార్థుల్లో ఉత్సాహం నింపాలి. వివరాలకు 9948605546ను సంప్రదించాలి. -కేవీ సుబ్బారెడ్డి, కౌశల్ జిల్లా కో–ఆర్డినేటర్, నంద్యాల

బహుమతులు ఇలా..

బహుమతులు	జిల్లాస్థాయి	రాష్ట్రస్థాయి
ప్రథమ	రూ.4500	రూ.15 వేలు
ద్వితీయ	రూ.3వేలు	రూ.12 వేలు
తృతీయ	–	రూ.9 వేలు

అలాగే రాష్ట్రస్థాయిలో ప్రోత్సాహక బహుమతుల కింద రూ.6 వేల చొప్పున నగదు అందిస్తారు.

పోస్టర్ ప్రజంటేషన్ పోటీలు

పోస్టర్–1 పోటీలు: జనరల్ (థీమ్) అంశంపై 8వ తరగతి విద్యార్థులు ఇద్దరు మాత్రమే పాల్గొనాలి.

పోస్టర్–2 పోటీలు: విజ్ఞాన రంగంలో భారతీయ శాస్త్రవేత్త కృషి అనే అంశంపై 9వ తరగతి విద్యార్థులు ఇద్దరు మాత్రమే పాల్గొనాలి.

బహుమతులు	జిల్లాస్థాయి	రాష్ట్రస్థాయి
ప్రథమ	రూ.1500	రూ.5 వేలు
ద్వితీయ	రూ.1000	రూ.3 వేలు
తృతీయ	–	రూ.2 వేలు

వైజ్ఞానిక లఘు చిత్రం పోటీలు

సులభ సూత్రాలు ఉపయోగించి రూట్–2 విలువలు కనుగొనడం లేదా ప్రాచీన భారతీయ శాస్త్రజ్ఞుల పరిశోధలు (17వ శతాబ్ద పూర్వం) ఈ పోటీలకు పదవ తరగతి నుంచి ఇద్దరు విద్యార్థులు మాత్రమే నమోదు కావాలి.

బహుమతులు	జిల్లాస్థాయి	రాష్ట్రస్థాయి
ప్రథమ	రూ.1500	రూ.5 వేలు
ద్వితీయ	రూ.1000	రూ.3 వేలు
తృతీయ	–	రూ.2 వేలు

అలాగే రాష్ట్రస్థాయిలో కన్సోలేషన్ బహుమతులు రూ.1500 చొప్పున ఇస్తారు.